

పల్లె ప్రగతి.. అదో గతి..!

పట్టణాలకు పట్టుకొమ్మలైన పల్లెలు అభివృద్ధికి నోచుకోక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీస వసతులకు దూరమై ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీల్లో నిధులు లేక ప్రజాప్రతినిధులు అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన ప్రజల కనీస వసతులు కూడా తీర్చలేని దుస్థితిలో ఉన్నామంటూ ఆవేదనలో ఉన్న నాయకులు ఎందరో..

- అభివృద్ధికి నోచుకోక.. పట్టించుకొనే వారు లేక
- గ్రామాల్లో అస్తవ్యస్తంగా చెత్తాచెదారం
- పారిశుధ్య పనులకు నిధుల కొరత



ప్రజాశక్తి-పూతలపట్టు: ఐదేళ్ల పాలనలో గత ప్రభుత్వంలో పంచాయతీల అభివృద్ధిని గాలికి వదిలేశారు. ప్రస్తుతం కొన్నిచోట్ల గ్రామపంచాయతీలో బ్లీచింగ్ కొనడానికి కూడా డబ్బుల్లేని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో సీఎం జగన్ సర్పంచులకు అధికారాలు, నిధులు ఇవ్వకుండా ముప్పుతెప్పలు పెట్టారు. ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లులు ఇతర కారణాలు చెప్పి ప్రభుత్వం మళ్లించింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు ఇవ్వకుండా జలజీవన్ మిషన్ తదితర పథకాలను నిర్వీర్యం చేసింది. గ్రామాల్లో సిసి రోడ్లు ఇంటింటికి కులాయి, మురుగు కాలు వల పూడిక తీయడం విద్యుత్ స్తంభాలు, నియంత్రికల ఏర్పాటు గ్రంథాలయాలు, తాగునీటి పనులు, నిలిచిపోయాయి. నాడు వైసీపీ చేసిన తప్పిదాలు నేడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి గుదిబండలా మారాయి. ప్రస్తుతం గ్రామాలను తిరిగి అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది.

చెత్త తీయడానికీ ఇబ్బందులే

పూతలపట్టు నియోజకవర్గంలో బంగారుపాళ్యం, పూతలపట్టు, ఐరాల, యాదమరి, మురికినీటి కాలువల శు భ్రత, వీధుల్లో పేరుకుపోయిన చెత్త, వెలగని వీధి దీపాలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ పంచాయతీల్లో కనీస నిధులు లేకుండా ఆయా సర్పంచులు అధికారులు ఏమి చేయలేని పరిస్థితి.

గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం నిండుకుంది. మురికినీటి కాలువల్లో మురుగు పేరుకుపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. వీధి దీపాలు లేక చీకటి పడితే గ్రామీణ ప్రజలు ఇండ్లకే పరిమితం కావలసి వస్తుంది. అటవీ ప్రాంతంలోని గ్రామీణులైతే రాత్రి సమయాల్లో విషపురుగులతో భయాందోళన చెందుతున్నారు.

రోగాల భయం..

జోరుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలానుగుణంగా వచ్చే వ్యాధుల ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే పలు గ్రామాల్లో విష జ్వరాలు డయేరియా లక్షణాలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను సోమవారం ఉ.10గం.ల నుంచి మ.1గం.వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు.

హామీల అమలుకు అసెంబ్లీలో నిర్దిష్ట చర్యలు ప్రకటించాలి



సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-పుంగనూరు: సూపర్ సిక్స్, ఎన్నికల హామీల అమలుకు సంబంధించి అసెంబ్లీలో నిర్దిష్ట చర్యలు ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు విజ్ఞప్తి చేశారు. ఆదివారం జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పుంగనూరులో సమావేశం జరిగింది. భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వ కోరలు ప్రజలు పీకేశారు. అయినా విద్వేష విధానాలు బిజెపి, మోడీ విడనాడలేదు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలను, ప్రాంతీయ పార్టీలను దెబ్బ కొట్టడానికి, చీల్చటానికి, ప్రలోభ పెట్టడానికి ప్రయత్నాలు బిజెపి కొనసాగిస్తున్నదని చెప్పారు. టిడిపి, జనసేన పార్టీలు బిజెపి కుట్రలను గమనించి రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడటానికి, మతసామరస్యాన్ని రక్షించడానికి గళం విప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. సూపర్ సిక్స్, ఇతర హామీల అమలుకు అసెంబ్లీ వేదికగా నిర్దిష్టచర్యలు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. గతంలోని వైసీపీ ప్రభుత్వం అసెంబ్లీని విమర్శలకు, ప్రతిపక్షాలను అణిచివేయడానికి వినియోగించుకున్నదని, దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై చర్చకు అసెంబ్లీని వేదికగా మార్చాలన్నారు. నాడు వైసిపి ప్రభుత్వ హయాంలో వలె, నేడు టిడిపి కూటమి ప్రభుత్వంలో హింస, దౌర్జన్యాలు, అణచివేత సాగకుండా, ముఖ్యమంత్రి అడ్డుకట్ట వెయ్యాలన్నారు. శాంతి భద్రతలను కాపాడాలి, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని వైసిపి నేటికీ బలపరుస్తోందని, పార్లమెంటులోను, దేశంలో బిజెపి, మోడీ ప్రతిపక్షాలను అణిచివేస్తున్నా, వైసిపి నోరు మెదపకపోగా మోడీని బలపరుస్తున్నది. అదే వైసిపి రాష్ట్రంలో నేడు ప్రజాస్వామ్య రక్షణ గురించి మాట్లాడటం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి చర్చ జరపాలన్నారు.

బాలికపై యువకుడు అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: పులిచెర్ల మండలం, ముప్పిరెడ్డిగారిపల్లెలో బాలికపై యువకుడు అత్యాచారం చేసిన దారుణం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముప్పిరెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన దంపతులకు ఓ కుమారుడు, పదేళ్ల కుమార్తె ఉన్నారు. రోజూలానే తల్లిదండ్రులు శనివారం కూలీ పనులకు వెళ్లగా.. బాలిక సచివాలయం వద్ద ఆడుకోవడానికి వెళ్లింది. అదే సమయంలో అక్కడకు వచ్చిన రెడ్డి హుస్సేన్ (26) అనే వ్యక్తి అక్కడకు వచ్చి బాలికకు మాయమాటలు చెప్పి సమీపంలోని మామి డి తోటలోకి తీసుకెళ్లాడు. అనంతరం బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిందితుడు లైంగిక దాడికి పాల్పడుతుండగా బాలిక కేకలు వేయడంతో తల్లి పరుగున వెళ్లింది. తల్లిని చూసిన నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సీనియర్ పోరాటయోధునికి సన్మానం

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని కీలపట్ల గ్రామానికి చెందిన సీనియర్ దళిత పోరాటయోధుడు సి.బోయకొండయ్యను జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ పలమనేరు పట్టణ కార్యాలయంలో పాతకీలపట్ల కె.మురళి అధ్యక్షతన ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా నాయకులు డివి మునిరత్నం, వేలాయుధం మాట్లాడుతూ బోయకొండయ్య ఎన్నో సంవత్సరాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సమస్యల పరిష్కారానికి ఎన్నో ఉద్యమాలు చేపట్టారని కొనియాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలను తన పాట ద్వారా కవితలు ద్వారా ఎంతో మందిని చైతన్యవంతం చేసి పోరాటాల వైపు ఆకర్షింప చేశారని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకూ బోయ కొండయ్య నిస్వార్థముతో ప్రజల కొరకు పనిచేసి చరిత్ర సృష్టించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను దృష్టిలో పెట్టుకొని పట్టణ, గ్రామీణ, బడుగు, బలహీన, మైనార్టీ ప్రజలకు ఉపయోగపడాలని కోరారు. కార్యక్రమంలో పార్థసారథి, సుబ్రహ్మణ్యం, రవికుమార్, పాండురంగాచారి, సాంబశివ, సరస్వతి, శివన్న తదితరులు పాల్గొన్నారు.

మోడీకి మోకరిల్లొద్దు..



రాష్ట్ర ప్రయోజనాలకై పట్టుబట్టండి..

జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో సీపీఎం రాష్ట్ర నేతలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం ప్రధాని మోడీకి మోకరిల్లకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం పట్టుబట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు, మూలం రమేష్ మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించడం వల్లనే వైఎస్ఆర్సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలల కాకుండానే అంగన్వాడీ, ఆశ వర్కర్లపై రాజకీయ వేధింపులకు పాల్పడటమే కాకుండా ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరించడం మానుకోకపోతే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీలపై వేధించడం, హత్యలు చేయడం, తప్పుడు కేసులు పెట్టడం లాంటి సంస్కృతిని విడనాడి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు రద్దుచేస్తామని హామి ఇచ్చి, ఇప్పుడు మళ్ళీ స్మార్ట్ మీటర్లు కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని తప్పుబట్టారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా తీర్మానాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కందారపు మురళి ప్రవేశపెట్టారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో వున్న ప్రజా సమస్యలపై సీపీఎం పోరాడుతుందని తెలిపారు. సెప్టెంబర్ నెల నుండి శాఖ, మండల, పట్టణ, జిల్లా వారీగా పార్టీ మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, నాయకులు పాల్గొన్నారు.

యాదమరిలో టీడీపీ, వైసీపీ హై డ్రామా

- మండల మీట్‌కి వస్తున్న జెడ్పీ వైస్ ఛైర్మన్‌ను అడ్డుకున్న టీడీపీ నేతలు
- సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన ఎంపీపీ సురేష్, వైసీపీ ఎంపీటీసీలు
- మండల అభివృద్ధిపై అధికారులకు సూచనలు చేసి వెనుతిరిగిన ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళిమోహన్



జెడ్పీ వైస్ ఛైర్మన్ కారును అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: యాదమరి మండల సర్వసభ్య సమావేశాన్ని ముందుగా అనుకున్న విధంగా అధికారులు ఆదివారం ఏర్పాటు చేశారు. ఆ మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చారు. కాగా ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉండగా వైసీపీ, టీడీపీ మధ్య హై డ్రామా నెలకొంది. సమావేశానికి జెడ్పీ వైస్ ఛైర్మన్ ధనుంజయరెడ్డి విచ్చేశారు. అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలు ధనుంజయరెడ్డి కారును అడ్డుకొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని టీడీపీ శ్రేణులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రజాప్రతినిధికి దారివ్వాలని సూచించారు. ఎంతకీ వినకనపోవడంతో సమావేశంకి వచ్చిన ఎంపీపీ సురేష్, సంఖ్యా బలం ఉన్న వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించి అక్కడి నుంచి నిష్క్రమించారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్‌కి మండల అధికారులు, టీడీపీ నాయకలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అధికారులనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధికి సహకరించాలని దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో సింగన్న ప్రకటించారు. కార్యక్రమంలో ఓటివారిపల్లి సర్పంచ్ భగవతి రాజేంద్రనాయుడు, పిఓపిఆర్డీ హరి ప్రసాద్ రెడ్డి, విద్యాశాఖ అధికారి రుక్మిణి, ఏపీఎం కల్పలత, ఏపీవో బాల, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సర్వే డిటీ జ్ఞాన శేఖర్, ఏఈలు కిషోర్, ప్రసాద్ నాయుడు, గుర్రప్ప, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రముఖ సీరియల్ నిర్మాత పల్లమాల సుధాకర్ తండ్రి జ్ఞాపకార్థం ధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అగ్నిగుండ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. తనతండ్రి జ్ఞాపకార్థం వందలాదిగా వచ్చిన భక్తులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందని సుధాకర్ తెలిపారు. ప్రతి ఏడాది తన తండ్రి జ్ఞాపకార్థం ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తానని తెలిపారు. పట్టాభి, సిద్ధులు ప్రసాద్, పల్లమాల శ్రీకాంత్ పల్లమాల శశాంత్, నారాయణ, చిరంజీవులు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో ప్రజలకు సేవచేయండి

మీ అందరి సహకారం మరువలేనిది: కమిషనర్ అదితి సింగ్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఉద్యోగాన్ని ఒక బాధ్యతగా భావించి, ప్రజలకు సేవలు అందించాలని, విధుల్లో మీరందరూ అందించిన సహకారం మరువలేనిదని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అన్నారు. కమిషనర్ అదితి సింగ్ కడప జాయింట్ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై వెళుతున్న సందర్భంగా ఆదివారం మున్సిపల్ సమావేశ మందిరంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదితి సింగ్ మాట్లాడుతూ ఉద్యోగులు అందరూ తమ విధులను బాధ్యతతో నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అంతా తనకు ఎంతో సహకరించారని, తాను వచ్చి కొద్ది కాలమే అయినా ఇక్కడ పనిచేసినా ప్రతి ఒక్కరూ తనకు బాగా సహకరించారని మీ సహకారం మరువలేనిది అన్నారు. తాను ఉద్యోగోన్నతిపై వెళ్ళినా, ఎక్కడ విధులు నిర్వహించినా ఇక్కడ పనిచేసిన కాలం జీవితంలో గుర్తుండి పోతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు తమస్థాయికి మించి సహకరించారని అన్నారు. రానున్న అధికారులను కూడా ఇదే విధంగా సహకరించి, సంస్థ పురోభివృద్ధి పనిచేయాలన్నారు. ఎన్నికల వేళ మా అందరినీ ఒక తాటిపై తీసుకువచ్చి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు మీరు చేసిన కృషి గొప్పదని నగరపాలక సంస్థ అధికారులు కమిషనర్‌ను కొనియాడారు. మీ వద్ద నుండి ఓపిగ్గా పనిచేసే విధానాన్ని మేమందరూ నేర్చుకున్నమని పలువురు అధికారులు అన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డెప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, స్మార్ట్ సిటి జిఎం.చంద్రమౌళి, ఆర్ఓలు సేతుమాధవ్, కేవెల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డి, సెక్రటరీ రాధిక, డిసిపి శ్రీనివాసులు, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని విభజన హామీలు అడిగే ధైర్యం లేదా: తులసి రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ఆంధ్ర రాష్ట్రవిభజన సమయంలో నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికంగా అన్ని ప్రాంతాలు సమతుల్యంతో అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ సీమాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖకు రైల్వేజోన్, మెట్రో రైల్ ఇలా అనేక వరాలు అమలై ఉంటే ఏపీ సుభిక్షంగా ఉండేదని కాంగ్రెస్ పార్టీ మీడియా ఛైర్మన్ తులసి రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన సమయంలో నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను కూడా అడిగే ధైర్యంలేని వారు పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. 2014 తర్వాత నవ్యాంధ్రకు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు, 2019లో సీఎం అయిన జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక హోదా అంశం గాని, విభజన హామీల అమలుకు కేంద్రంపై చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయలేదన్నారు. కేంద్రంలో 2014, 2019లో బిజెపికి పూర్తి మెజారిటీ ఉండేదని, కానీ 2024లో ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు సరైన సమయమని కేంద్రంపై ఒత్తిడి తెస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వం కన్నా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని, ఏదో ఒక హింసాత్మక ఘటన ప్రతిరోజు జరుగుతూనే ఉండడం కలవరపాటుకు గురిచేస్తుందన్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే జగన్మోహన్ రెడ్డికి పట్టిన గతి కూటమి ప్రభుత్వానికి ఐదు నెలల్లో పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి ఎన్ని ప్రతి దాడులు చేసుకుంటున్న బిజెపితో మాత్రం అంటగాగి ఉంటారని స్పష్టం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రయోజనాలపై చంద్రబాబు దృష్టి సారించకపోతే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ప్రమీలమ్మ, మాంగాటి గోపాల్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, పార్థసారధి రెడ్డి, చిట్టిబాబు, సోమశేఖర్ రెడ్డి, శివ శంకర్, నన్నేఖాన్, నరేంద్రబాబు, గోపిగౌడ్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తులసి రెడ్డి

ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇంటర్వ్యూ



శ్రీనివాస్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తోందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు ఇజ్రాలు వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచారకులు శ్రీనివాస్ తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూ..

చిత్తూరు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు అంటే అంగవైకల్యం కలిగిన వారికోసం కృత్రిమ అవయవాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం కృత్రిమ అవయవాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇది ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు జిల్లా కార్యాలయంలో అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి: విభిన్న ప్రతిభావంతులకు అందించిన ఉపకరణాలు, వాటి విలువ ఎంత..?

ఏడి: విభిన్న ప్రతిభావంతుల శాఖ గత సంవత్సరం నుంచి రూ.53.982 లక్షల ఖర్చు చేసి ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, చంక కర్రలు, స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ కేర్, రోలెక్టర్ సిపి చైర్, అడ్జస్టబుల్ స్టిక్స్ 1,210 అందించడం జరిగింది.

ప్రజాశక్తి: విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వసతి గృహాల పనితీరు ఎలా ఉంది..?

ఏడి: జిల్లా కేంద్రమైన చిత్తూరులో ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహం నడుపుతున్నాం. ఈ వసతి గృహంలో ఉంటూ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు వసతి ఉచిత భోజనం అందించడం జరుగుతోంది. ప్రస్తుతం 50మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న అందుల వసతి గృహంలో 70మంది ఆశ్రయం పొందుతున్నారు.

ప్రజాశక్తి: బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేస్తున్నారా..?

ఏడి: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ కొన్ని పర్మినెంట్ పోస్టులను బ్యాక్లాగ్ పోస్టులుగా గుర్తించి భర్తీ చేయడం జరుగుతుంది. ఈ ప్రక్రియ ప్రతి సంవత్సరం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో బ్యాక్లాగ్ పోస్టులను గుర్తించి విభిన్న ప్రతి భావంతుల్లో అర్హులైన వారి ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి భర్తీ చేస్తున్నాం. 2022-23లో 8 పోస్టులను గుర్తించి భర్తీ చేయడం జరిగింది.

ప్రజాశక్తి: విభిన్న ప్రతిభావంతులకు స్వయం ఉపాధికి ఉన్న అవకాశాలు ఏమిటి..?

ఏడి: జాతీయ విభిన్న ప్రతిభావంతుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా 2023-2024 సంవత్సరంలో 20మంది విన్న ప్రతిభావంతులకు స్వయం ఉపాధి పథకం కింద స్వయం ఉపాధి కోసం పాడి ఆవులు, చిల్లర దుకాణాలు, కొవ్వొత్తుల తయారీ, ఇటుకల తయారీ, ఇంటర్నెట్ సెంటర్, జిరాక్స్ సెంటర్ వంటి యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు రూ.55.57 ప్రతిపాదనలు పంపడం జరిగింది.

ప్రజాశక్తి: విభిన్న ప్రతిభావంతుల సులభతర రవాణా కోసం మోటార్ సైకిల్ పంపిణీ చేస్తున్నారా..?

ఏడి: ప్రభుత్వా నిబంధనల మేరకు జిల్లాలోని 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు అర్హులైన పీజీ చదువుతున్న విభిన్న ప్రతిభావం తులకు 65మోటారు సైకిళ్ళు రూ.75.60లక్షలతో మంజూరు చేయడం జరిగింది.

నేడు వేపంజేరిలో గణిత ప్రజ్ఞాధారణ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో గల హైస్కూల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు గణిత అవధాని అరుణ శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులచే గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం జరుగుతుందని ఏపీ మ్యాథ్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు ఎం.చంద్రమనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డిలు తెలిపారు. కార్యక్రమాన్ని వేపంజేరి హైస్కూల్ హెచ్ఎం, టీచర్లు, మండలంలోని వివిధ హైస్కూల్లోని గణిత టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి మిటూరు ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం పాఠశాలలో కలిశారు. 2000-2001 పదవ తరగతి చెందిన పూర్వ విద్యార్థులు 24ఏళ్ల తర్వాత కలిసి మొదట పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహానికి పూజ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉప విద్యాశాఖ అధికారి నాగరాజన్ మాట్లాడుతూ పాఠశాలలో విధినభ్యసించిన విద్యార్థిని విద్యార్థులు 24సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో చాలా గొప్ప విషయం అన్నారు. గతంలో గురువులు నేర్పిన విద్యాబుద్ధులు విద్యార్థులు పలు విధాలుగా అభివృద్ధికి సోపానాలైనట్టు పూర్వ విద్యార్థులను చూస్తుంటే అర్థమవుతుందని వ్యాస గురు పౌర్ణమి పురస్కరించుకుని గురువులను సత్కరించడం చాలా ఆనందం కలిగిస్తుంది అన్నారు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు పాఠశాలకు తమ వంతు సహాయం అందిస్తామని తెలపడం హర్షించదగ్గ విషయం అన్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మునిరత్నం ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సుజాత పలువురు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేద్దాం

- టీడీపీ నేతల పిలుపు

ప్రజాశక్తి-రామకుప్పం: సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి నాలుగు రోజుల కుప్పం పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి కోరారు. మండలంలోని ఆవులకుప్పం, నారాయణపురం తాండా, ఆరిమానుపెంట, వీర్నమలలో ఈనెల 25వ తేదీన ఆమె పర్యటించనున్న గ్రామాల్లో స్థలాలను వారు పరిశీలించారు. గత ఎన్నికల ప్రచారంలో టిడిపికి అత్యధిక మెజార్టీ బూత్‌లను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని నారా భువనేశ్వరి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె పర్యటనను మండలంలోని ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి, ఘన స్వాగతం పలికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి నరసింహులు, మనోహర్, జయశంకర్, గజేంద్ర, విశ్వనాథ్, మురళి, రఘు తదితరులు పాల్గొన్నారు.

అడుసుపల్లెలో కావిళ్ళ ఊరేగింపు

ప్రజాశక్తి-సోమల: సోమల పంచాయతీ అడుసుపల్లెలో ఆదివారం పుష్పకావిళ్ళ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా తిరుత్తనికి కావిళ్ళతో వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. కాగా ఆదివారం గ్రామం నుంచి 30కుటుంబాలు కవిళ్ళతో తిరుత్తని బయలుదేవి వెళ్లారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఆదివారం సాయి మాతా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరానికి చెందిన శంకర కమిటీ ఆసుపత్రి వారు శిబిరంలో 150మందికి కంటి పరీక్షలు చేశారు. 62 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించినట్టు నిర్వాహకులు తెలిపారు. వీరికి సోమవారం బెంగళూరులో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు.

ఎంపీపీ యల్లప్ప సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-సదుం: మండలంలో ఎంపిపిగా పని చేస్తూ ఇటీవల గుండె పోటుతో మరణించిన బొజ్జా యల్లప్పకు ఆదివారం బూరగమంద, రామాపురంలో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేసి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన బంధువులు, ఆత్మీయులు, వైసీపీ నాయుకులు మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సదుం మండలంలో ఎంపిపిగా ఆయన సేవలను వక్తలు కొనియాడారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: టీడీపీ దాడిలకు గురైన బాధిత కుటుంబాలకు వైసీపీ తరపున ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆదివారం మండలంలోని వెంగంవారిపల్లికి చెందిన వైసీపీ రవి, రాజేశ్వరి, భాస్కర్, మురుగేష్‌లకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప చేతుల మీదుగా చెక్కులను అందజేశారు.

విద్యార్థుల వన సందర్శన

ప్రజాశక్తి- రేణిగుంట: కేశవరెడ్డి ఈఎం స్కూలు విద్యార్థులకు ప్రకృతి పరిచయ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ప్రకృతి రమణీయం' అనే నాటిక నృత్యాలు, వన సందర్శన , రకరకాల మొక్కల పరిచయం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు వన సందర్శన చేశారు. విద్యార్థులకు రకరకాల మొక్కలను పరిచయం చేసి మన నిత్య జీవితంలో ఎలా ఉపయోగ పడతాయో వివరించారు. విద్యార్థులు 'వన సందర్శన' కార్యక్రమాన్ని చాలా చక్కగా ఆనందించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి విద్యా సంస్థల ఫౌండర్, చైర్మన్ కేశవరెడ్డి మాట్లాడుతూ మానవుని జీవితం ప్రకృతితో ముడిపడి ఉందని ప్రకృతి లేనిదే ప్రాణి లేదని, మన జీవన విధానం ప్రకృతితో విడదీయ రాని బంధం ఏర్పడి వుందని, మానవుడు జీవించడానికి, ప్రాణవాయువు ఎంతో అవసరమని, గాలి, నీరు, అగ్ని, ఆకాశం, భూమి, వీటిని సరిగా ఉపయో గించు కుంటే మానవుని జీవితం అద్భుతంగా ఉంటుందన్నారు. ప్రకృతిలో, రక రకాల మొక్కలు, వనమూలికలు, మానవుని ఆరోగ్య వంతుడిని చేయడంలో కీలక భూమిక పోషిస్తాయని ఎన్నో రకాల పళ్లచెట్లు 'మన ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయని, చెట్ల నుండి వచ్చే ఆక్సిజన్, ప్రాణ వాయువుగా మారి మానవునికి జీవితాన్నిస్తాయని, విద్యార్థులకు చిన్ననాటి నుంచే, ప్రకృతిని పరిచయం చేసి ప్రకృతి పట్ల వారి బాధ్యతని గుర్తు చేయడం చాలా శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కృషి చేస్తాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: గ్రామాభివృద్ధి కృషి చేస్తామని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ అన్నారు. ఆదివారం పూతలపట్టు మండలంలో ఆయన సుడిగాలి పర్యట చేశారు. అందులో భాగంగా యాదమరి మండలంలో ఆర్‌టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించారు. మండలంలోని చిత్తూరు–యాదమరి వయా దళవాయి పల్లెకు నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు.

తవణంపల్లి: తవణంపల్లి మండలం ఏ.గొల్లపల్లి పంచాయతీకి ఆదివారం ఎమ్మెల్యే మురళీమోహన్ విచ్చేశారు. షిరిడీ సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాలొన్నారు. అనంతరం అక్కడే నిర్వహిస్తున్న సత్య నారాయణ వ్రతంలో పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఈశ్వర్ కళ్యాణ్ అభయం ట్రస్ట్ మోహన్ నాయుడు ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పుస్తక సామగ్రిని పంపిణీ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బాలాజీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వడ్డుపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు వికలాంగులుగా మారిన సుబ్రహ్మణ్యం, మధు కుటుంబాలను పరామ ర్శించి వారికి వీలైనంత త్వరగా రూ.15వేల పిం ఛను అందించేలా చొరవ చూపాలని డిఎంఅండ్ హెచ్ఓ ప్రభావతి దేవితో ఫోన్లో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అందించే పింఛన్ అందించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

శాకంబరీదేవి సేవలో..

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాక వినాయక స్వామిని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్ ఆదివారం దర్శించుకున్నారు. ఆషాఢ గురుపౌర్ణమి సందర్భంగా కాణిపాకం విచ్చేసిన ఎమ్మెల్యేకు ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనుబంధ ఆలయమైన మకగదాంబిక సమేత శ్రీ మణికంఠేశ్వర స్వామి ఆలయంలో ఆషాడ గురుపౌర్ణమి పురస్కరించుకుని శాకంబరీ అలంకరణ సందర్భంగా శివాలయంలో నిర్వహించిన అమ్మవారికి ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు


సోమలలో


బంగారుపాళ్యంలో


రామకుప్పంలో

ప్రజాశక్తి-సోమల: గురు పౌర్ణమి సందర్భంగా సోమలలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం వైభవంగా వేడుకలు జరిగాయి. కలశ స్థాపన, కుంబాభిషేకం, అభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని జంబువారిపల్లిలోని మాధవ నగర్‌లో బ్రహ్మానంద ఆశ్రమంలో పౌర్ణమి పురస్కరించుకొని అన్నదానం చేపట్టారు. ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ పూజ వ్రతాన్ని చేపట్టారు.

శాంతిపురం: శాంతిపురంలోని పరమ హంస యోగానంద విద్యాలయంలో గురు పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం, పెద్దలకు పాద పూజ చేపట్టారు. ముఖ్య అతిథులుగా విద్యాలయ ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్, గురూజీ భక్తులు నారాయణ శెట్టి, చంద్రశేఖర్, గణపతి శాస్త్రి, కోదం డప్ప, ప్రధాన పురోహితులు వెంకట సుబ్బయ్య పా ల్గొని విద్యార్థులకు గురువుల ప్రాధాన్యతను వివరించారు.

గంగాధరనెల్లూరు: గురు పౌర్ణమి సందర్భంగా జీడీ నెల్లూరు సీతారామాలయంలో ఆదివారం రిటైర్డ్ హెచ్ఎం దామోదర్ రెడ్డికి పలువురు నాయకులు శాలువతో సత్కరించి గురుదక్షిణ సమర్పించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సుధాకం నారాయణమూర్తి ఆచారి, సుందరరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అదేవిధంగా వేపంజేరిలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో గరుడ వాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది.

రామకుప్పం: మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమిని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ప్రత్యేక అభిషేకాలు చేసి వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమాలు ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహింరించారు.

కుప్పం టౌన్: పట్టణంలో సాయి దేవాలయాలలో గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి స్వామివారికి విశేష అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బలిజ సంఘం భవనానికి విరాళం


బలిజ సంఘ భవనానికి విరాళం ఇస్తున్న దాతలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరులో నిర్మిస్తున్న బలిజ సంఘం భవనానికి దాతలు రూ.2 లక్షలు ఆదివారం విరాళంగా అందించారు. పుత్తూరు మండల బలిజ సంఘం అధ్యక్షులు పసుపులేటి శివయ్య అధ్యక్షతన ఆ సంఘం సమావేశం నిర్వహించారు. పట్టణంలో నిర్వహించే ద్రౌపది దేవి ధర్మరాజులు బ్రహ్మోత్సవాల్లోఅలుగు ఉత్సవాన్ని బలిజ సంఘం ఘనంగా నిర్వహించాలని పుత్తూరు బలిజ సంఘం అధ్యక్షుడు పసుపులేటి శివయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు. పట్టణంలో బలిజ సంఘం భవన నిర్మాణం పూర్తి అయిన తరణంలో సంఘ భవనం ప్రారంభోత్సవం ఆగస్టు 9వ తేదీన ప్రారంభించాలని అందరూ ఆమోదం తెలిపారు. పుత్తూరుద్రౌపది దేవి ధర్మరాజుల తిరునాలలో బలిజ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహిం చే అలుగు ఉత్సవం ఘనంగా నిర్వహించాలని అందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇ. గోపిరాయల్, వెంకటేష్, వెంకటసుబ్బయ్య, డి జయ ప్రకాష్, కృష్ణయ్య, విక్కీ రాయల్, మునయ్య, మెరుపుల మహేష్, ఎల్ జి రవికుమార్, సూర్యనారాయణ, మండలంలోని పట్టణంలోని బలిజ కులస్తులు, నాయకులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి విమర్శలు మానుకోవాలి

జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చంద్రగిరిలో ఎమ్మెల్యే పులివర్తి నానిని ఎదుర్కోలేని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దిగజారుడు మాటల తో విమర్శించడం మానుకోవాలని టిడిపి జిల్లా బిసి సెల్ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు టిడిపి కార్యాల యంలో బిసి నాయకులతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షణ్ముగం రెడ్డి మాట్లాడుతూ వెనుక బడిన తరగతుల ఆర్థిక, రాజకీయ, సాధికారత కోసం ఆవిర్భవించిందే టిడిపి అన్నారు. టిడిపి ఒక బిసినాయకుడిని గుర్తించి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా చేస్తే స్వాగతించాల్సింది పోయి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డి సిఫార్సు మేరకే టిడిపి జిల్లా అధ్యక్ష స్థానాన్ని సిఆర్ రాజన్‌కి కట్టబెట్టారని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చెప్పడం అతను దిగజారిన రాజకీయానికి నిదర్శనం అన్నారు. సిఆర్ రాజన్ పెద్దిరెడ్డికి ప్రియ శిష్యుడు అయితే వైసిపిలో శాసనసభ టికెట్ ఎందుకు ఇవ్వలేదో చెవిరెడ్డి సమాధానం ఇవ్వాలన్నారు. వారికి చిత్తశుద్ధి ఉంటే సీఆర్ రాజన్ చేసిన సేవలను గుర్తించి శాసనసభ టికెట్ ఇప్పించకపోగా కనీసం ఒక బీసీ నాయకుడుగా మీ పక్కన కూర్చోబెట్టలేదు.. చంద్రగిరిలో మీరు చేసిన దౌర్జన్యాలను, అరాచకాలను, భూ దందాలను, చూడలేకే వైసిపి వదిలి టిడిపిలో సీఆర్ రాజన్ చేరాడని తెలిపారు. ఈ సమావేశంలో పుత్తూరు పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు ఏలుమలై రెడ్డి, టిఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి పండారం మణి, పుత్తూరు పట్టణ బీసీ సెల్ ఉపాధ్యక్షులు సంతోష్, రెండవ వార్డు ఇన్‌ఛార్జి కాశీ, చిదంబరం, మహేష్ పాల్గొన్నారు.

'హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: హమాలీ కార్మికులకు సంక్షేమ ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశం ఆదివారం బైరాగి పట్టెడ లోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాధాకృష్ణ, ఆ సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ ఎన్‌డి రవి మాట్లాడుతూ హమాలీ కార్మికులకు ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల తరహాలో సంక్షేమ చట్టం మాదిరిగా హమాలీ కార్మికులకు కూడా సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలని, 45 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి కేరళ ప్రభుత్వ తరహాలో 6వేల రూపాయల పింఛను అందివ్వాలని, అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నాణ్యమైన యూనిఫామ్‌ను ప్రభుత్వం ఇవ్వాలని, కార్పొరేట్ హాస్పిటల్ లో వైద్యం ఉచితంగా అందివ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి బాబు సాంబయ్య, చిన్నబ్బ పాల్గొన్నారు.

జెవివి సేవలు అభినందనీయం


జెవివి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జన విజ్ఞాన వేదిక సేవలు అభినందనీయమని జెవివి ఉపాధ్యక్షులు చెంచు నారాయణ పేర్కొన్నారు. జెవివి ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని బనిగి సాహెబ్ పేట వద్దనున్న పెట్రోల్ బంక్ దగ్గర ప్రత్యేక ప్రతిభావంతులకు నారాయణ కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. దాత డాక్టర్ కుడుముల వెంకటనారాయణ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి ఉపాధ్యక్షులు చెంచు నారాయణ మాట్లా డుతూ వెంకట నారాయణ మా జనవిజ్ఞాన వేదిక ద్వారా అనేక కార్యక్రమాలకి తోడ్పాటు అందిస్తు న్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అల వరచు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రాధయ్య, గుర్రం విజయబాబు, చెంచు నారాయణ, సుబ్బారావు, ఆనంద్, సాయి కిరణ్, శ్రీనివాస ఆచారి, తిరకాల శంకరయ్య, సుధీర్, నారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం, మత్తు పదార్థాలను అరికట్టాలి..

ప్రజాశక్తి - క్యాంపస్ : నేటి బాలల్లో, యువతలో నేర ప్రవృత్తికి కారణమవుతున్న మద్యం, మత్తు పదార్థాలను అరికట్టాలంటూ పిడిఎస్‌వో ఆధ్వర్యంలో తిరుపతి బాలికల వసతి గృహంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి ఆర్ ఆష మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో నేరాలకు పాల్పడుతున్న వారిలో అత్యధికంగా మద్యం, మత్తు పదార్థాలకు బానిసలైన మైనర్లు, యువత ఉండటం గమనార్హం అన్నారు. హత్యో, అత్యా చారమో జరిగినప్పుడల్లా ప్రభుత్వం ముసలి కన్నీరు కారుస్తోంది తప్ప మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా ఉండటానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. ఏ పనికి ఎటువంటి పర్యవసానాలు ఉంటాయో తెలియని పసి మనసులు నేడు మద్యం, మత్తు పదార్థాలకి, సినిమాలలో అసభ్య దృశ్యాలకి, పోర్న్ సైట్లకి, ఆన్‌లైన్ గేమ్‌లకి బానిసలవుతున్నారు. రేపటి పౌరులుగా ఎదగా ల్సిన బాలలు నేడు నేరస్తులవుతున్నారు. మద్యం, మత్తు పదార్థాలను, విష సంస్కృతిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వం నేడు చోద్యం చేస్తోందని, ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకొని మైనర్లలో, యువతలో నేర ప్రవృత్తిని పెంచుతూ మహిళలపై, చిన్నారులపై హత్యలకు, అత్యాచారాలకు కారణమవుతున్న మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని కోరారు. జిల్లా నాయకులు స్రవంతి మాట్లాడుతూ రాష్ట్రంలో బలమైన చట్టాలు, దిశా యాప్‌లు ఏవీ చిన్నారులపై, మహిళలపై జరుగుతున్న ఘోరాలను ఆపలేకపోతున్నాయన్నారు. మద్యం, మత్తు పదార్థాలను నిషేధిం చడం ఒకటే దీనికి శాశ్వత పరిష్కారం అన్నారు. ఆ వైపుగా విద్యార్థి యువకులు ప్రభుత్వాన్ని డిమాండు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాధవి, గాయత్రి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



ప్రజాశక్తి-నాయుడుపేట: స్నేహం ఎప్పటికీ మారిపోదని ఎన్నేళ్లు గడచినా స్నేహం ఎల్లప్పుడూ చిగురిస్తూనే ఉంటుందని నాయుడుపేటకు చెందిన కొందరు పూర్వ విద్యార్థులు నిరూపించుకున్నారు. తమతో కలిసి చదువుకుని ప్రస్తుతం అనారోగ్యం కారణంగా బాధపడుతున్న నాటి మిత్రుడు షేక్ సిరాజ్‌కు పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. నాయుడుపేట జిల్లా పరిషత్ హైస్కూలులో సుమారు 40 సంవత్సరాల క్రితం 1982లో 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమతో కలసి చదువు కొని నేడు అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ సిరాజ్‌కు 45 వేల రూపాయలు నగదు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలురు శ్రీనివాసులు, చిట్టేటి అంకయ్య, శేషం ముని మనోహర్, కావేరిపాకం శ్రీనివాసులు, కెయం బాలాజీ, ఎం సిద్దయ్య, జి భాస్కర్, షేక్ రహమత్ బాష పాల్గొన్నారు. ఇటీవల తమ స్నేహితుడు గొట్టిముక్కల శ్రీనివాసరాచార్య మృతి చెందారని, తమ స్నేహానికి గుర్తుగా ఆయన కుటుంబానికి తమ వంతు సాయంగా ఆయన భార్యకు 45 వేల రూపాయలు త్వరలో అందించనున్నట్లు స్నేహితులు తెలిపారు.

ఎల్లమ్మకు ఎమ్మెల్యే సారె



ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మకు ఎమ్మెల్యే పులివర్తి నాని, సుధా రెడ్డి దంపతులు ఆదివారం సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తాము అఖండ విజయం సాధించడంతో సారె తీసుకొచ్చిన ఎమ్మెల్యే దంపతు లకు ఆలయ కార్యనిర్వహణ అధికారి పుట్ట రామకృష్ణా రెడ్డి, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి సారెను తీసుకొచ్చిన ఎమ్మెల్యే దంపతులతో పాటు నాయకులకు దర్శనం కల్పించి శేష వస్త్రాలు బహూకరించి, ఆశీర్వచనాలతో తీర్థ ప్రసాదాలు అందిం చారు. ఆలయ పునఃనిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పలు అంశా లపై అధికారులతో చర్చించారు. నిధులు ఎంతైనా పరవా లేదని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. నిధులు ఎంతైనా తాము సమ కూర్చుతామని తెలిపారు. ఆలయంలో శిల్పకళ ఉట్టిపడే లా పనులు చేయాలని సూచించారు.

కుంభాభిషేక మహోత్సవ కమిటీ ఏర్పాటు

మూలస్థాన ఎల్లమ్మ పునర్నిర్మాణ పనులు ఆఖరి దశలో ఉండటంతో అమ్మవారి కుంబాభిషేక మహోత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే నాని ప్రకటిం చారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా మొక్కల చంద్రశేఖర్ రెడ్డి (యంసిఆర్) ని, కమిటీ సభ్యులుగా ఎం గోపి, ఆర్ వెంకట ముని, కె దుర్గా, డి మునికృష్ణమ నాయుడు, పి పాపమ్మ, జి దేవి, ఎం గోపాల్ రెడ్డి, యు భారతి లను నియ మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కుంభా భిషేక మహోత్సవ కమిటీ అందరితో ఐకమత్యంగా వుంటూ ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు వి సుబ్రహ్మణ్యం నాయుడు, వి రమేష్ రెడ్డి, లంకెల లలిత సక్కూరి ధనుంజయ రెడ్డి, మునిరత్నం రాయల్, వేణు గోపాల్, లోకాద్రి నాయుడు, అమ్ములు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

- కిటకిట లాడిన భక్తులు



ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీద్రౌపది సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మో త్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండం ప్రవేశంతో వైభవంగా ముగిసింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు కర్పూర హారతులు పట్టారు. అదేవిధంగా మహిళలు అమ్మవారికి పొంగళ్ళు వండి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పోకల సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యాక్షుడు శివప్రకాష్, కోశాధికారి బాబురెడ్డి, ఉప కోశాధికారి క్రిష్ణయాదవు. భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీ.ఐ సత్యబాబు ఆధ్వర్యంలో స్థానిక ఎస్.ఐ వెంకటక్రిష్ణ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అలరించిన బలిబండి కూడు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం బలిబండి కుంభాల కార్యక్రమం జరిగింది. ముందుగా ఎద్దులబండికి ప్రత్యేక అలంకరణ చేసి కళాకారులు బలిబండి ఉత్సవాన్ని నిర్వహించారు. పరసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని బలిబండి కార్యక్రమాన్ని తిలకించారు.

వీధి దీపాల ఏర్పాటు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీలోని పలు గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్ ఆధ్వర్యంలో మురికి నీటి కాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పల్లెలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్న ఉద్దేశంతో మురుగునీటి కాలువలను గ్రామంలోని ముళ్ళ కంపలను తొలగించడం జరుగుతుందని అదేవిధంగా అక్కడక్కడ వీధి దీపాలు నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక బాబు అగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో అవధూత మాసపత్రిక తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా టాటా, స్వీకార్ క్యాన్సర్ హాస్పిటల్, రష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ల బృందంచే ఉచ్చిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ ప్రారంభించారు. ప్రతి మనిషికి జీవితంలో ఆరోగ్యమే చాలా ముఖ్యమైందని, అందులోనూ క్యాన్సర్ సోకకుండా జాగ్రత్త పడాలన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో గురు పౌర్ణమి (వ్యాస పౌర్ణమి) సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు వెంకట రమణారెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డి , సహ కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ గురు పౌర్ణమి విశిష్టత గురించి వివరించారు. సమాజంలో గురువు అవశ్యకత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమితి సహ కారదర్శి యస్‌వియల్ ప్రసాద్ సిహెచ్‌వెంకట రమణయ్య , ఆర్. రవిచంద్ర రెడ్డి రూపేష్ రెడ్డి ఆర్‌విరావు , ప్రధానచార్యులు రంగనాయకులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరేటమ్మకు ఇత్తడి ఉయ్యాల వితరణ


ఇత్తడి ఉయ్యాలను వితరణ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: స్థానిక అరేటమ్మ దేవా లయానికి రవి కుమార్, లోకేశ్వరి దంపతులు ప్రతి పౌర్ణమికి ఆరేటమ్మ దేవాలయంలో ఊంజల సేవ నిర్వహణకు 25వేలా ఆరు వందల రూపాయలు విలువ చేసే ఇత్తడి ఉయ్యాలను వితరణగా ఆలయ నిర్వాహకులకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎల్‌జి రవికుమార్ మాట్లాడుతూ గతంలోనూ ఆలయ ప్రాంగణంలో శిలాఫలకం ఏర్పాటుకు, ప్రహరీ గోడలు, గ్రిల్స్ నిర్మాణానికి, టైల్స్ వేసేందుకు ఆలయ అభివృద్ధికి ఆర్థికసాయం చేశామని అందులో భాగంగా ప్రతి గురుపౌర్ణానికి ఊంజల సేవ నిర్వహణకు ఉయ్యాలను వితరణ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

నాడార్‌లను బిసి కేటగిరిలో చేర్చేందుకు కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: నాడార్లను బీసీ కేటగిరీలో చేర్చేందుకు కృషి చేస్తానని తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు తెలిపారు. కామరాజ్ నాడార్ 122వ జయంతి వేడుకలను తిరుపతి నాడార్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ కాలనీలోని నాడార్ కళ్యాణ మండపంలో ఈ వేడుకలు నిర్వహించారు. నాడార్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షులు శివస్వామి నాడార్ మాట్లాడుతూ తమిళనాడులో నాడార్ కులం బిసిగా పరిగణిస్తున్నారని రాష్ట్రంలో కూడా బిసిలుగా నాడార్ లను గుర్తించాలని కోరారు. తమిళ మీడియం స్కూల్ ను తిరుపతిలో పునఃప్రారంభించాలని ఆయన కోరారు. నాడార్ కళ్యాణమండపం ఆనుకుని మద్యం షాపు ఉందని దీన్ని తొలగించాలని ఆయన కోరారు. కామరాజ్ నాడార్ బడుగు, బలహీన వర్గాలకు విద్యా, సామాజిక రంగాల్లో ప్రాధాన్యత కల్పించడంలో ఆయన విశేషకృషి చేశారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. కామరాజ్ నాడార్ మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నా చనిపోయేనాటికి నూటముప్పయ్ రూపాయలు మాత్రమే ఉన్నాయంటే ఆయన ఎంతటి సాధారణ జీవితాన్ని గడిపారో అనడానికి నిదర్శనమని ఆయన చెప్పారు. నాడార్ లను బిసీల్లో చేర్పించే అంశాన్ని సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తమిళ మీడియం స్కూల్ ను నగరంలో పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మన్యం శ్రీనివాసులు, కార్పోరేటర్ అన్నా అనితా యాదవ్, అన్నా మల్లీశ్వరి, బిజెపి నాయకులు నవీన్ కుమార్ రెడ్డి, జనసేన నాయకులు అత్తులూరి భాను, కృష్ణకాంత్, వంశీ, జిలానీ, నాడర్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు తంగరాజ్ నాడార్, ఉదయ సూర్యన్ పాల్గొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

- దోమల విజృంభణ
- జ్వరాలు వ్యాపిస్తాయని భయాందోళన



ప్రజాశక్తి- వెంకటగిరి: పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దోమలు విపరీతం కావడంతో విష జ్వరాల బారిన పడాల్సి వస్తుందోమోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెంకటగిరి మున్సిపాల్టీలో దోమల బెడద అధికమైంది. చీకటి పడితే చాలు ముసురుతున్న దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడదను తట్టుకునేందుకు ప్రజలు మస్కిటో కాయిల్స్, అగర్ వత్తులు, దోమ తెరలు వినియోగించాల్సి వస్తోంది. చీకటి పడితే చాలు దోమల బెడద భరించలేక పోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణకు మున్సిపాలిటీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సాధారణంగా సాయంత్రం వేళల్లో ఇంటి తలుపులు తెరిచి ఉంచుతారు. కానీ వెంకటగిరిలో దోమల బెడద వల్ల తలుపులు మూసి ఉంచే పరిస్థితి నెలకొంది. రాత్రివేళ బయట కూర్చోవాలంటే దోమలతో ఇబ్బందిగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. చిరు వ్యాపారులు, మెకానిక్‌లు దోమల బెడదతో టేబుల్ ఫ్యాన్లు ముందు పనులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాడిపై ఆధారపడి జీవించేవారు వేకువ జామున పాలు పితకాలన్నా ఫ్యాన్ పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం..

వెంకటగిరి మున్సిపాల్టీలో 25 వార్డులున్నాయి. పారిశుధ్య నిర్వహణ కోసం వంద మంది పైగా కార్మికులున్నారు. కానీ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించక డ్రైనేజీలు దోమలకు నిలయంగా మారాయి. మరో వైపు వ్యర్థాలు నిండి పోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. ఈ పరిస్థితి దోమల వృద్ధికి అనుకూలంగా మారుతోంది. ముఖ్యంగా 14 వార్డు లోని ధర్మాపురం, తొలిమిట్ట, కాశీపేట తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని ఆ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తరుచూ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు, మున్సిపల్ కమిషనర్‌కు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తున్నారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. దోమల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. అయినా దోమల నివారణ ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. దోమల నివారణ చర్యలు కానరావడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫాగింగ్ యంత్రాలున్నా వినియోగించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడంతో దోమల బెడద పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణ కోసం పకడ్బందీ చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ సమావేశాలు ప్రతినెలా నిర్వహించాలి

వెంకటగిరి మున్సిపల్ సమావేశాలు ప్రతినెలా నిర్వహించేలా మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్ చర్యలు తీసుకోవాలి. మూడు నెలలకు ఓసారి నిర్వహించడం వల్ల పారిశుధ్యం, తాగునీరు, మౌలిక వసతుల సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించలేక పోతు న్నాం..



- ఆరి శంకరయ్య, 14వ వార్డు కౌన్సిలర్, వెంకటగిరి మున్సిపాల్టీ.